

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
శుక్రవారం 20 డిసెంబరు 2024





తూప్రాన్ మున్సిపాలిటీకి చేంజ్ మేకర్స్ అవార్డు



తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ చింతల మధు చేంజ్ మేకర్స్ అవార్డు అందుకున్నారు. ఢిల్లీలో గురువారం నిర్వహించిన చేంజ్ మేకర్స్ కంక్లేవ్ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ 2.0 ఆధ్వర్యంలో ఈ అవార్డులను అందజేశారు. 2021-24 వరకు స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమాలు, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు మున్సిపాలిటీకి అవార్డు వచ్చింది.

-తూప్రాన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి)

కంసమ్మ ఇంట మామిడి కాసింది!

చెట్టుకు ఓ వైపు పూత.. మరోవైపు కాత

వసంత రుతువు రాకముందే మామిడి కాత కాసింది. మామిడి చెట్లకు పూతవచ్చే సమయంలోనే ఆ చెట్టుకు నోరూరించే పుల్లటి మామిడికాయలు కాశాయి. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ గ్రామానికి చెందిన గుర్గుల కంసమ్మ అంజయ్య ఇంట్లో మామిడి చెట్టు ఓ కొమ్మకు పూత.. మరో కొమ్మకు కాతతో ఆకట్టుకుంటున్నది. నాలుగు సంవత్సరాల క్రితం మొక్కను నాటామని.. ఈ ఏడాది తొలిసారి కాత వచ్చిందని చెప్పారు. ఒకే చెట్టుకు పూత, కాత రావడం విచిత్రంగా ఉందని పేర్కొన్నారు.

-అల్లాదుర్గం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి)

చలికి వణుకుతున్నా..
చీపురు పట్టాల్సిందే!

ఆంధ్రజ్యోతి ఫోకస్

- మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై అధికారుల నిర్లక్ష్యం
- చలికాలంలోనూ కనీస సౌకర్యాలు కల్పించని వైనం
- స్వెటర్లు, గ్లౌజులు, బూట్లు లేక ఇబ్బందులు
- సేఫ్టీ ఆప్రాన్‌లు లేక ప్రమాదాల బారినపడుతున్న వైనం
- పుష్కలంగా ఆదాయం ఉన్నా కనీస అవసరాలనూ తర్చని బల్దియాలు

'సంగారెడ్డి మున్సిపాలిటీలో 224 మంది పారిశుధ్య కార్మికులున్నారు. వీరికి చలికాలంలో ఇవ్వాల్సిన మంకీ క్యాప్‌లు, గ్లౌజులు, బూట్లు, స్వెట్టర్లు ఇప్పటివరకు అందలేదు. తెల్లవారుజామున 4 గంటల నుంచే పనిలోకి వెళ్లే కార్మికులు చలికి వణుకుతున్నారు. ఏడాది క్రితం కొత్త బస్టాండ్ వద్ద వాహనం ఢీకొట్టి ఇద్దరు కార్మికులు చనిపోయారు. ఆరోజు రేడియంతో కూడిన సేఫ్టీ ఆప్రాన్ ఉంటే ప్రాణాపాయం తప్పేది.'

'సదాశివపేట మున్సిపాలిటీలో 128 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఎముకలు కొరికే చలిని తట్టుకునేందుకు వీరికి ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. చలి తీవ్రతకు తట్టుకోలేక ఉదయం 7 గంటల తర్వాతే విధుల్లోకి వస్తున్నారు. అయినా చలికి చేతులు పిడుసగట్టుకుపోతున్నాయని కార్మికులు వాపోతున్నారు. రెండేళ్లుగా కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు, ఆప్రాన్‌లు, చీరలు, బూట్లు పంపిణీ చేయడం లేదు.'

'మెదక్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు గ్లౌజులు, స్వెటర్లు, బూట్లు, మఫ్లర్లు ఇవ్వలేదు. వీరిలో ఔట్‌సోర్సింగ్ ద్వారా రిక్రూటైనవారే ఎక్కువ ఉన్నారు. వీరికి రెండు నెలలుగా జీతాలు కూడా సక్రమంగా అందడంలేదు. ఇటు మున్సిపాలిటీ నుంచి చలికాలంలో సౌకర్యాలు కల్పించక.. అటు వేతనాలు సక్రమంగా ఇవ్వక ఇబ్బంది పడుతున్నారు. చలికి తాళలేక కొందరు రాత్రివేళలోనే తమ విధులు నిర్వహించడానికి ఆసక్తి చూపిస్తున్నారు.'



సదాశివపేటలో తెల్లవారుజామున చలికి వణుకుతూనే రోడ్డును శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికురాలు



సంగారెడ్డిలో చలిలోనే పనుల్లో నిమగ్నమైన కార్మికులు

మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది. మెదక్, తూప్రాన్, రామాయంపేట, నర్సాపూర్, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, జోగిపేట, అమీన్‌పూర్, తెల్లాపూర్, సదాశివపేట మున్సిపాలిటీల్లో కార్మికులు చలికి వణికిపోతున్నా పట్టించుకునే నాథుడు లేడు. కోడి కూయక ముందే పనుల్లో నిమగ్నమయ్యే కార్మికులపై శ్రద్ధ చూపించడంలో మున్సిపల్ పాలకవర్గాలు, అధికారులు విఫలమవుతున్నారు. కార్మికుల దుస్థితి గురువారం 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలనలో బయటపడింది.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, డిసెంబరు 19: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పాటు స్థానికంగా వసూలు చేస్తున్న పన్నులతో మున్సిపాలిటీలన్నీ ఆదాయ మార్గంలోనే నడుస్తున్నాయి. ఆయా మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు, చైర్మన్ పదవులను దక్కించుకోవడం కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్న పరిస్థితి. అదే విధంగా కంప్యూటర్ ఆపరేటర్ నుండి కమిషనర్ దాకా అన్ని పనుల్లోనూ తగిన ప్రాధాన్యత

మిగతా 8వ పేజీలో

సఫాయి కార్మికుల సమస్యలు
సత్వరమే పరిష్కరిస్తాం

- కార్మికులందరికీ గుర్తింపు కార్డులు
- ఈపీఎఫ్ ఖాతా నెంబర్లు నెల లోపు ఇవ్వాలి
- జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేష్



సమావేశంలో మాట్లాడుతున్న సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేష్

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 19 : సఫాయి కర్మచారిల సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేష్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఆయన అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా అధికారులతో కలిసి సఫాయి కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ కార్పొరేషన్ల ద్వారా సఫాయి కార్మికుల కుటుంబ సభ్యులకు రుణాలు ఇప్పించి ఉపాధి కల్పించాలని పేర్కొన్నారు. జిల్లాలోని మున్సిపల్ సఫాయి కార్మికులకు నెల రోజుల్లోగా ఐడెంటిటీ కార్డులు ఈపీఎఫ్ ఖాతా నంబర్లు అందజేయాలని ఆదేశించారు. సఫాయి కార్మికుల కార్మికులకు సేఫ్టీ కిట్లు, మాస్కులు, సబ్బులు, ఆయిల్, బూట్లు, గ్లౌజులు, యూనిఫామ్ అందజేయాలని సూచించారు. కార్మికులకు సంవత్సరానికి రెండుసార్లు వైద్య పరీక్షలు చేయించాలని, అవసరమైనవారికి వైద్యచికిత్స అందజేయాలని మున్సిపల్ ఆదేశించారు. సఫాయి కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 011 24648924కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అంతకుముందు ఆయనకు కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

జీజీహెచ్‌లో వైద్య సేవలు భేష్

రోగులకు అందజేస్తున్న సేవలపై కేంద్ర బృందం సంతృప్తి



సంగారెడ్డిలోని టీ-హబ్‌లో ల్యాబ్ రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్(పీఎం-ఏబీహెచ్ఐఎం)ప్రతినిధులు గురువారం సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ అధికారులు డా.అనిల్‌కుమార్ గుప్తా, నబీల్‌అహ్మద్‌తో పాటు స్టేట్ ఎన్‌హెచ్ఎం ప్రోగ్రాం ఆఫీసర్ బృందం జీజీహెచ్‌ను తనిఖీ చేశారు. తొలుత టీ-డయాగ్నోస్టిక్‌హబ్‌లో రికార్డులు పరిశీలించి పరికరాలు, రోగ నిర్ధారణ పరీక్షలపై ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనాన్ని పరిశీలించి, ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరును ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడిచే అమృత్ ఫార్మసీని పరిశీలించారు. అంతకు ముందు రిక్షాకాలనీలోని బస్తీదవాఖానాను సందర్శించి సేవలపై ఆరా తీశారు. కేంద్రం మంజూరు చేస్తున్న నిధుల వినియోగంపై ఆరా తీశారు. వారివెంట జీజీహెచ్ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్, ఆర్ఎంవోలు వీరాంజనేయులు, రవికుమార్, విజయసందీప్, డీఈ విల్సన్, ఏఈలు వెంకటేశ్, శివ తదితరులు ఉన్నారు.

కళా క్షేత్రం..
'విస్సా నిలయం'

సాంస్కృతిక వైభవానికి కృషి చేస్తున్న ఆయుధ కర్మాగారం ఉద్యోగి

లలిత కళలు, భాషా, శ్లోకాలు, సంగీతం, నృత్యంలో చిన్నారులకు తర్ఫీదు

తెలుగు-వెలుగు పేరుతో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ

7



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ క్రాంతి

హాస్టళ్లలో మెనూ పక్కాగా
అమలు చేయాలి

నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

8



తలాపునే చెరువున్నా.. పొలం బీడు!

గొటిగర్‌పల్లి పెద్దచెరువుపై నిర్లక్ష్యం

చెరువు నిండుగా ఉన్నా ఆయకట్టుకు అందని నీరు

బీడువారిన 1,100 ఎకరాల ఆయకట్టు

ప్రారంభించకుండానే అటకెక్కిన ఎత్తిపోతలు

తలాపునే చెరువున్నా పొలాలు బీడువారిన దుస్థితి పెద్దవాగు ప్రాజెక్టు ఆయకట్టుది. నిండుగా నీటితో చెరువు కళకళలాడుతున్నా ఒక్క మడికీ నీరు అందడం లేదు. గొలుసుకట్టు చెరువులను అభివృద్ధి చేశామని గత ప్రభుత్వం చెప్పుకున్నా ఈ చెరువుకు చేసిందేమీ లేదు. అధికారులు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చుక్క నీరు కూడా రైతులకు అందడం లేదు.

కోహీర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం గొటిగర్‌పల్లి పరిధిలో 196 ఎకరాల్లో (పెద్దవాగు ప్రాజెక్టు) పెద్దచెరువు నిర్మాణం చేపట్టారు. 1,100 ఎకరాల ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అప్పట్లో చెరువు నిర్మాణానికి 60 మంది రైతులు స్వచ్ఛందంగా భూములిచ్చారు. ఈ చెరువు నిండితే ఆయకట్టుకు రెండు పంటలకూ నీరందేంది. పదేళ్ల క్రితం వరకు ఆయకట్టు పచ్చని తివాచీలా కనిపించేది. గొటిగర్‌పల్లితో పాటు మూడు తండాల పరిధిలో రైతులు పంటలు సాగుచేసుకునేవారు. గతంలో చెరువులో నీటి సామర్థ్యాన్ని పెంచేందుకు అలుగును నిర్మించారు. నీటి ఉధృతిని తగ్గించేందుకు అలుగుపై ఫాలింగ్ షెటర్లను ఏర్పాటు చేశారు. పూడికతీయకపోవడంతో ప్రస్తుతం చెరువు నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. భారీ వర్షాలు కురిసినప్పుడు అలుగుపై నుంచి నీరు దిగువన ఉన్న కర్ణాటకకు పోతున్నది. పెద్దచెరువు నుంచి జాడిమల్కాపూర్, సిద్దాపూర్ గ్రామాలకు నీటిని సరఫరా చేసేందుకు గతంలో ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం పైప్‌లైన్, భారీ మోటర్లను ఏర్పాటు చేశారు. కానీ, నిర్మాణంలో ఎడతెగని జాప్యం కారణంగా

మిగతా 8వ పేజీలో

గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

అధికారులకు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశం



మెదక్ చర్చిలో గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మెదక్ కేథడ్రల్ చర్చిని ఈ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ నెల 22న సందర్శించనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య, సెక్రెటరీ బోనితో కలిసి గురువారం ఆయన చర్చి ఆవరణలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాట్లను పరిశీలించారు. గవర్నర్ పర్యటన రూట్‌మ్యాప్, పార్కింగ్‌పై చర్చి నిర్వాహకులు, అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ కేథడ్రల్ చర్చి వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా నిర్వహించే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదివారం గవర్నర్ పర్యటనకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

హాస్టల్‌లో కలెక్టర్ తనిఖీలు

కొల్చారం, (ఆంధ్రజ్యోతి): మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం కొల్చారం మండల పరిధిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల మరియు కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, విద్యార్థుల మెనూ, డైనింగ్‌హాల్, డార్మెటరీ, స్టోర్‌రూమ్‌లను పరిశీలించారు. మెనూ పక్కాగా అమలు చేయాలని, భోజనం నాణ్యంగా ఉండాలని ఆదేశించారు.

అమీన్‌పూర్ రోడ్డు దుస్థితిపై శాసనమండలిలో ప్రస్తావన

మూడు నెలల్లో మరమ్మతులు పూర్తిచేస్తామని వెల్లడించిన మంత్రి కోమటిరెడ్డి

పటాన్‌చెరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ ప్రధాన రహదారి దుస్థితిపై శాసనమండలిలో ఎమ్మెల్సీ కోదండరాం గురువారం ప్రస్తావించారు. వర్షాలకు గుంతలమయంగా మారిన రోడ్డును ఎప్పుడు పునరుద్ధరిస్తారని ప్రశ్నించారు. చందానగర్ జాతీయ రహదారి నుంచి అమీన్‌పూర్ వరకు శిథిలమైన రోడ్డుతో నిత్యం వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీనికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందిస్తూ చందానగర్-అమీన్‌పూర్ రోడ్డు నిర్మాణానికి టెండర్ ప్రకియ పూర్తిచేసి పనులు ప్రారంభించామని తెలిపారు. ప్రస్తుతం కరెంటులైన్ల తొలగింపు ప్రకియ కొనసాగుతోందని, మూడు నెలల్లో రోడ్డును అందుబాటులోకి తెస్తామని అన్నారు. బీహెచ్ఈఎల్ చౌరస్తా, అమీన్‌పూర్, పటాన్‌చెరు, సంగారెడ్డి రోడ్ల విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయని వివరించారు. బీహెచ్ఈఎల్ చౌరస్తాలో రూ. 173 కోట్లతో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. మదీనగూడా నుంచి భెల్ జంక్షన్ మీదుగా సంగారెడ్డి వరకు రూ. 1,298 కోట్లతో ఆరు లైన్ల రోడ్డు పనులు సాగుతున్నాయని పేర్కొన్నారు.

మిషన్ భగీరథ వర్కర్లకు రెండు నెలల జీతాలు

- ఆందోళన విరమించిన కార్మికులు
- నీటి సరఫరా పునరుద్ధరణ



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మిషన్ భగీరథ వర్కర్లతో చర్చలు జరుపుతున్న అధికారులు

మునిపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు విడుదలయ్యాయి. 15 నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్న మిషన్ భగీరథ హెల్పర్లు ఆందోళన బాటపట్టడంతో మూడు రోజులుగా జిల్లాలో నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయంపై 'మూడు రోజులుగా నీళ్ల బంద్' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో గురువారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో, అధికార యంత్రాంగం దిగొచ్చి సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుదేరా చౌరస్తా వద్ద ఉన్న హౌజ్‌బార్ మెయిన్‌వాల్స్ వద్ద పనిచేసే వర్కర్లతో చర్చలు జరిపారు. ఎస్ఈ రఘువీర్, ఈఈ విజయలక్ష్మి, జహీరాబద్, సదాశివపేట డీఈ నాగేందర్ బాబు, సుచరిత, పటాన్‌చెరు, మునిపల్లి ఏఈలు కవిత స్రవంతి, ఏఈ సునీతలు వర్కర్లతో చర్చలు జరిపారు. రెండు నెలల వేతనాలు వెంటనే విడుదల చేస్తామని చెప్పడంతో ఉదయం 11 మెయిన్‌వాల్ ఓపెన్ చేశారు. కానీ, సాయంత్రం 6 గంటల వరకు జీతాలు విడుదల కాకపోవడంతో మరోసారి మెయిన్ వాల్స్ బంద్ చేశారు. దీంతో అధికారులు కలుగజేసుకొని వర్కర్లకు నచ్చజెప్పి తిరిగి తెరిపించారు. మిషన్ భగీరథ వర్కర్లకు 15 నెలల జీతాలు పెండింగ్‌లో ఉండగా గురువారం రెండు నెలల డబ్బులు చెల్లించినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన 8 నెలల జీతాలు శనివారం వరకు చెల్లిస్తామని తెలియజేశారు. మిగిలిన ఐదు నెలల మొత్తం త్వరలో చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

డెలివర్రీ

వంటగ్యాస్ సరఫరాలో జాప్యం



పట్టణంలోని ఓ ఏజెన్సీ వద్ద గ్యాస్ కోసం వేచిచూస్తున్న వినియోగదారులు

- బుక్‌చేసి 15 రోజులైనా అందని గ్యాస్ సిలిండర్లు
- వినియోగదారుల ఖాతాల్లోకి చేరని సబ్సిడీ డబ్బు

జహీరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వంటగ్యాస్ కొరతతో వినియోగదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గ్యాస్ బుక్‌చేసి 15 రోజులు గడిచినా సంగారెడ్డి జిల్లాలో పలుచోట్ల డెలివరీ చేయడం లేదు. ఆయా ప్రాంతాల్లో గ్యాస్ డెలివరీ వాహనాలు, సరఫరా చేసే వారి కోసం నిరీక్షించక తప్పడం లేదు. సకాలంలో ఇంటికి గ్యాస్ రాకపోవడంతో పల్లెల్లో కట్టెల పొయ్యిలను వినియోగించక తప్పడం లేదు. పట్టణాల్లో పక్కవారు, తెలిసిన వారి వద్ద అరువుగా తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండేసీ సార్లు బుక్‌చేసిన వంటగ్యాస్ రావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ఏజెన్సీల నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడం మూలంగానే ఇలా జరుగుతుందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

నియోజకవర్గంలో లక్షకుపైచిలుకు గ్యాస్‌కనెక్షన్లు

నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు వంటగ్యాస్‌ను అందించేందుకు వీలుగా భారత్, ఇండియన్, హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలున్నాయి. ఆయా మండలాల పరిధిలో సుమారు లక్షకుపైచిలుకు వంటగ్యాస్ కనెక్షన్‌లుండగా సగటున ప్రతిరోజు ఆయా ఏజెన్సీల నిర్వాహకులు సుమారు వెయ్యికిపైగానే సరఫరా చేస్తున్నారు. గ్యాస్‌కు డిమాండ్ అధికంగా ఉన్నందున అందుకు అనుగుణంగా ఏజెన్సీలు పనిచేయడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఆయా ఏజెన్సీల్లో వాహనాలు, సిబ్బంది కొరత, చిన్న చితక సమస్యలతో వెరసి సకాలంలో వంటగ్యాస్‌ను వినియోగదారులకు చేరవేయలేని పరిస్థితి ఏర్పడింది.తాము సకాంలోనే అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అలా లేవు.

కంపెనీల నుంచే ఆలస్యంగా..

కంపనీల నుంచే గ్యాస్ బండలు ఆలస్యంగా వస్తున్నాయంటూ ఏజెన్సీల నిర్వాహకులు, అందులో పనిచేసే ఉద్యోగులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో గ్యాస్‌ను బుక్ చేసిన వినియోగదారులు సమీపాల్లోని ఏజెన్సీ కార్యాలయాల వద్దకు, గోదాములకు వద్దకు చేరుకుని గొడవలు పడాల్సిన పరిస్థితి స్థానికంగా ఏర్పడింది. మారుమూల గ్రామాల్లో ఉండి గ్యాస్ బుక్ చేసుకున్న వారు, కిలోమీటర్ల దూరంలోని ఆయా ఏజెన్సీల చుట్టు తిరుగాల్సి వస్తుంది. దీంతో వినియోగదారుల సమయం, డబ్బు వృథా అవుతుంది. టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్ల వారు వాణిజ్య సిలిండర్లనే వాడాల్సి ఉన్నప్పటికీ, కొన్ని చోట్ల వంటగ్యాస్ ఉన్న వారితో బుక్ చేయించుకుని వాటినే వినియోగిస్తున్నారని, దీని వల్ల గ్యాస్ కొరత ఏర్పడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు.

సిలిండర్‌పై అదనపు వసూళ్లు

వంటగ్యాస్‌కు రూ.975 కాగా అదనంగా మరో రూ.30-50ని డెలివరీ బాయ్స్ వసూలు చేస్తూనే ఉన్నారు. వంటగ్యాస్‌ను 15 కిలోమీటర్ల లోపు దూరం ఉంటే వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేయడానికి వీలు లేదు. 15 కిలోమీటర్లు దాటితే వినియోగదారుడి సంతోషం మేరకు ఎంతోకొంత ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, గ్యాస్‌ను మొబైల్ ఎస్ఎంఎస్ లేదా వాట్సాప్ నంబర్ ద్వారా బుక్ చేశాక, మరుసటి రోజు లేదా రెండు రోజుల్లో సిలిండర్‌ను ఏజెన్సీల నిర్వాహకులు ఇంటింటికి పంపించాల్సి ఉంటుంది. అలాగే వారానికో గ్రామం చొప్పున ఏజెన్సీల నిర్వాహకులు తేదీలను నిర్ణయించుకుని గ్యాస్‌ను ఆయా ప్రాంతాలకు పంపిస్తుంటారు. బుక్ చేసిన 15 రోజుల వరకు గ్యాస్ అందడం లేదంటే జహీరాబాద్ ప్రాంతంలో వంటగ్యాస్ సరఫరా ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పరిహారం ఏది?

నియోజకవర్గంలోని చీలమామిడి, కొత్తూర్(బి), జహీరాబాద్ పట్టణంలోని ఫయ్యాజ్‌నగర్, మానిక్‌ప్రభుమహేళా, మూసానగర్, ఎన్జీవోస్‌కాలనీ తదితర ప్రాంతాల్లో కొన్నాళ్లక్రితం సిలిండర్లు పేలి వినియోగదారులు గాయాలకు గురై మృత్యువాత పడ్డారు. వారికి పరిహారం ఇవ్వడంలో ఆయా కంపెనీలు విఫలమయ్యాయని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇక ప్రభుత్వం సిలిండర్‌ను రూ.500లకే ఇస్తామని చెప్పినప్పటికి ఆచరణలో సాధ్యంకావడం లేదు. సబ్సిడీ నగదు ఖాతాల్లోకి చేరడం లేదని వినియోగదారులు వాపోతున్నారు.

సబ్సిడీ జమ కావడం లేదు

ఓవైపు గ్యాస్ సక్రమంగా రావడంలేదు. మరోవైపు సబ్సిడీ ఇవ్వడం లేదు. బుక్ చేసి 15 రోజులైనా డెలివరీ చేయలేదు. గ్యాస్ సిలిండర్‌ను రూ.975కు కొనుగోలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ ఖాతాలో జమకావడం లేదు. ఏజెన్సీ కార్యాలయంలో సబ్సిడీ అడిగితే అది మాకు సంబంధం లేదంటున్నారు. బ్యాంకుల్లో అధికారులను అడగండి అంటూ సమాధానమిస్తున్నారు.

- రఘుపతి, బాబుమోహన్‌కాలనీ, జహీరాబాద్

చర్యలు తీసుకుంటాం

వినియోగదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటాం. బుక్‌చేసిన వెంటనే గ్యాస్‌ను అందజేసేందుకు ఏజెన్సీల నిర్వాహకులు కృషిచేయాలి. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ హెచ్చరిస్తున్నాం మరీ మొండికేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వినియోగదారులు ఇబ్బందులు పడకుండా ఏజెన్సీల నిర్వాహకులు చూసుకోవాలి.

- బస్వరాజ్, సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్

జీవవైవిధ్య విధానంతోనే ప్రజారోగ్యం

డీడీఎస్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ లయ

ఝరాసంగం,డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : జీవవైవిధ్యంతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని డీడీఎస్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ లయ పేర్కొన్నారు. గురువారం మండలపరిధిలోని కస్తూర్బా, కుప్పానగర్ తదితర పాఠశాలల్లో డీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జీవైవిధ్యంపై క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి

- సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్



సిగ్నల్స్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 19 : వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. పాశమైలారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద కూడలిలో సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అన్ని పరిశ్రమలకు సంబంధించిన యాజమాన్యాలు సొసైటీలో సభ్యులుగా చేరాలని సూచించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మెదక్ జిల్లా క్రీడాకారుల ఎంపిక

మనోహరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలలో తెలంగాణ బాలబాలికల జట్టుకు మెదక్ జిల్లా నుంచి 8 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కోడిప్యాక నారాయణగుప్తా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 నుంచి 24 వరకు జమ్మూ కశ్మీర్‌లో జరిగే ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రం నుంచి 32 మంది క్రీడాకారులు పాల్గొననున్నారని ఆయన పేర్కొన్నారు. వారిలో జిల్లా నుంచి కార్తీక, శ్రీకృతి, శిరీష, గీతిక, విజయ్, శ్రీవాత్సవ, వరుణ్, నిషాంత్‌ను ఎంపిక చేశారని తెలిపారు.

కిక్‌బాక్సింగ్‌లో రాష్ట్ర స్థాయికి ప్రణతి

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో కొనసాగుతున్న సీఎం కప్ కిక్ బాక్సింగ్ పోటీల్లో కొండాపూర్ మండలం తేర్పోల్‌కు చెందిన ప్రణతి గోల్డ్ మెడల్ సాధించారు. జిల్లా స్థాయిలో జరిగిన కిక్‌బాక్సింగ్ రెండో రౌండ్‌లో ప్రణతి ప్రతిభ కనబరచగా రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ప్రణతిని డీవైఎస్‌వో ఖాసీంబేగ్, మాస్టర్ పోచయ్య, తల్లిదండ్రులు అభినందించారు.

రేపు ఉమ్మడి జిల్లా హాకీ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా హాకీ క్రీడా ఎంపికలు ఈ నెల 21న బీహెచ్‌ఈఎల్ హాకీ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో ఖాసీంబేగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27 నుంచి సీఎం కప్ హాకీ క్రీడా పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

22న ఖోఖో ఉమ్మడి జిల్లా సీనియర్స్ జట్టు ఎంపిక

నర్సాపూర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో సీనియర్స్ జట్టు ఎంపికను 22న నర్సాపూర్‌లోని గిరిజన గురుకులంలో నిర్వహిస్తున్నట్లు హెచ్‌వోసీ ఏడీ మహేందర్‌రావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు ఎంపికైన జట్టు వచ్చే జనవరి 8 నుంచి 11వ తేదీ వరకు వరంగల్‌లో నిర్వహించే 57వ రాష్ట్ర స్థాయిపోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డుతో ఉదయం 9గంటల వరకు గిరిజన గురుకులానికి చేరుకోవాలని సూచించారు.

గణిత శాస్త్ర రాష్ట్రస్థాయి సెమినార్‌కు సిద్దిపేట జిల్లా ఉపాధ్యాయులు

కొండపాక, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గణిత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సిఈఆర్‌టి) నిర్వహించే సెమినార్‌కు సిద్దిపేట జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. 21న హైదరాబాద్‌లో జరిగే సెమినార్‌లో రాష్ట్రం నుంచి 31 మంది ఉపాధ్యాయులు ఎంపిక కాగా అందులో ముగ్గురు ఉపాధ్యాయులు సిద్దిపేట జిల్లాకు చెందినవారు ఉన్నారు. పీవీ సత్యకుమార్(పెద్దమాసాన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాల), ప్రదీప్‌కుమార్ (సంగుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల), వి.అజయ్‌కుమార్(కుకునూరుపల్లి ఉన్నత పాఠశాల) సెమినార్‌కు ఎంపికయ్యారు. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, సెక్టోరియల్ ఆఫీసర్లు అభినందనలు తెలిపారు.

నేడు దివ్యాంగులకు ప్రత్యేక వైద్య శిబిరం

మెదక్ కల్చరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఉన్న దివ్యాంగుల కోసం శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణిలో ఇచ్చిన హామీ మేరకు శిబిరాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పలువురు స్పెషలిస్ట్ వైద్య నిపుణులు శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ పథకాలు దూరం

- వాపోతున్న వెల్దుర్తికి చెందిన మహిళ



ప్రమీల

వెల్దుర్తి, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి) : అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ పథకాలకు దూరమయ్యాయని వెల్దుర్తికి చెందిన మహిళ వాపోతుంది. పట్టణానికి చెందిన కిచ్చుగారి ప్రమీల భర్త నర్సింలు కొన్నేళ్ల క్రితం మృతిచెందారు. ఇద్దరు కూతుళ్ల వివాహాలు కావడంతో, ప్రమీల ఒంటరిగా ఒకే గదిలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ప్రభుత్వం ప్రజాపాలనలో గృహలక్ష్మీ, ఇందిరమ్మ ఇల్లు, మహాలక్ష్మీ పథకం, గ్యాస్ రాయితీల అమలు కోసం దరఖాస్తు చేసుకుని రశీదును తీసుకుంది. కానీ ఏ పథకం ఆమెకు వర్తించడం లేదు. ఇప్పటికే అమలవుతున్న గృహజ్యోతి పథకం కూడా అమలు కాకపోవడంతో నెలనెలా కరెంట్ బిల్లులను చెల్లిస్తుంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే జాబితాలో సైతం ప్రమీల పేరు రాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తుంది. అన్ని అర్హతలు ఉండి ఒంటరి మహిళనైన తనకు అధికారుల తప్పుతో ప్రభుత్వ పథకాలు దూరం అవుతున్నాయని, పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరుతుంది.



ప్రజాపాలన దరఖాస్తు రశీదు

క్రైం కార్నర్

బిల్డింగ్‌పై నుంచి పడి ఒకరి మృతి


అజీముద్దీన్(ఫైల్)

చిన్నకోడూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు బిల్డింగ్ ఫస్ట్ ఫ్లోర్ బాల్కనీ నుంచి కింద పడటంతో తీవ్ర గాయాలై ఒకరు మృతిచెందిన సంఘటన చిన్నకోడూరులో గురువారం జరిగింది. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకోడూరు గ్రామానికి చెందిన మహమ్మద్ అజీముద్దీన్(47) బతుకుదెరువు కోసం ఏడాదిన్నర క్రితం కువైట్‌కు వెళ్లి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం తెల్లవారుజామున అజీముద్దీన్ కువైట్ నుంచి గ్రామంలోని ఇంటికి వచ్చాడు. కొద్దిసేపటికి అతడే బాత్‌రూంకు వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బిల్డింగ్ ఫస్ట్ ఫ్లోర్ బాల్కనీ నుంచి కింద పడటంతో తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో అజీముద్దీన్‌కు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య హజీర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడు..

దుబ్బాక, డిసెంబరు 19 : ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడు మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి దుబ్బాక మండల పరిధిలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శిలాజీనగర్‌కు చెందిన పెంబర్తి రాకేష్(24) గ్రామంలోని ఓ వ్యక్తి ఇంటికి మట్టిని తరలిస్తున్నాడు. సదరు ఇంటి వద్ద ట్రాక్టర్‌ను నిలిపాడు. ట్రాక్టర్ ఇంజన్ ఆఫ్ చేయకపోవడంతో ఒక్కసారిగా ముందుకు కదలడంతో రాకేష్ గమనించి ఇంజన్ ఆఫ్ చేసేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో కాలు జారీ ట్రాక్టర్ చక్రాల కింద పడ్డాడు. వెంటనే స్థానికులు దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు యువకుడు మృతిచెందిననట్లు తెలిపారు. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని దుబ్బాక ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు

వెల్దుర్తి, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని యశ్వంతరావుపేట చౌరస్తా వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. యశ్వంతరావుపేట గ్రామానికి చెందిన బ్యాగరీ కళావతి, శ్రీనివాస్ కుమారుడు బ్యాగరీ వంశీ(14) మంగళపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సాయంత్రం పాఠశాల ముగిసిన అనంతరం ఇంటికి వస్తుండగా యశ్వంతరావుపేట చౌరస్తా వద్ద రోడ్డు దాటుతున్న అతడిని నర్సాపూర్ వైపు నుంచి వెల్దుర్తి వైపు వస్తున్న కారు ఢీకొన్నది. దీంతో వంశీకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై వెల్దుర్తి ఎస్‌ఐ రాజును సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

చెరకు తోట దగ్ధం

- ఎనిమిది ఎకరాలకు మంటలు
- రూ.6 లక్షలు నష్టం


దగ్ధమైన తోట

హవేళిఘణపూర్, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో చెరకు తోట దగ్ధమైన ఘటన మండలంలోని బొగుడ భూపతిపూర్ శివారులో గురువారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొగుడభూపతిపూర్ గ్రామానికి చెందిన రైతులు మంద సాయిలు చెరకు తోటలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు రేగాయి. దీంతో సమీప రైతుల రమేష్, సంజీవులు, నర్సింలు, నాజీల చెరకు తోటలకు మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. 8 ఎకరాల్లోని పంట దగ్ధమైంది. రూ.6లక్షల వరకు పంట నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

సిరిసినగండ్లలో ఆటో..


కాలిపోయిన ఆటో

కొండపాక, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు ఆటోకు నిప్పంటించడంతో దగ్ధమైన సంఘటన కొండపాక మండల పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. మండలంలోని సిరిసినగండ్ల గ్రామానికి చెందిన ఎర్రవల్లి సాయిబాబా తన ఆటోను రోజు మాదిరిగా బుధవారం రాత్రి ఇంటిముందు నిలిపి పడుకున్నాడు. తిరిగి గురువారం ఉదయం చూసేసరికి ఆటో కాలిపోయిఉన్నది. ఎవరో గుర్తుతెలియ వ్యక్తులు దగ్ధం చేశారని రూ.1.50 లక్షలు నష్టం జరిగిందని బాధితుడు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.


బతుకమ్మ సంబరాల్లో పిల్లలతో గేయాలను ఆలపింపజేస్తున్న విస్సా సత్యసాయి


సినారె నుంచి పురస్కారం అందుకుంటున్న సత్యసాయి(ఫైల్)

కళా క్షేత్రం..‘విస్సా నిలయం’

సాంస్కృతిక వైభవానికి కృషి చేస్తున్న ఆయుధ కర్మాగారం ఉద్యోగి

లలిత కళలు, భాషా, శ్లోకాలు, సంగీతం, నృత్యంలో చిన్నారులకు తర్ఫీదు

తెలుగు-వెలుగు పేరుతో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ

సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధి ఎద్దుమైలారం ఆయుధ కర్మాగారం ఉద్యోగి సత్యసాయి తనవంతు ప్రయత్నం చేస్తున్నారు. ఆయన ఇంటి పేరుతో స్థాపించిన విస్సా నిలయం ద్వారా కృషి చేస్తున్నారు.


ఆయుధ కర్మాగారంలో చిన్నారులకు శ్లోకాలను నేర్పిస్తున్న సత్యసాయి


విస్సా నిలయం ఆధ్వర్యంలో చిన్నారుల భరతనాట్యం

కంది, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక యుగంలో లలిత కళలు, శాస్త్రీయ సంగీతం, నృత్యం, భక్తి గీతాల ఆలాపన తదితర కళలకు ఆదరణ కరువైపోతుంది. సెల్‌ఫోన్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లు, సోషల్‌మీడియాలో రీల్స్ అంటూ యువతతో పాటు చిన్నారులు కాలక్షేపం చేస్తున్నారు. పిల్లలకు సాంకేతిక అంశాలను నేర్పించేందుకు శ్రద్ధ చూపుతున్న తల్లిదండ్రులు సంప్రదాయ కళల వైపు చూడడం లేదు. ఇలాంటి అంతరించిపోతున్న కళలను వెలుగులోకి తెచ్చేందుకు

ఉద్యోగం చేస్తూనే..

తూర్పు గోదావరి ప్రాంతానికి చెందిన విస్సా సత్యసాయి ఆయుధ కర్మాగారంలో విధులు నిర్వర్తిస్తూనే మరో వైపు తన తాత ముత్తాతల కాలంలో స్థాపించిన విస్సా నిలయం ఫౌండేషన్ ద్వారా సంస్కృతి పరిరక్షణకు పాటుపడుతున్నారు. విద్యార్థులకు ఉచితంగా లలిత కళలు, ఆధ్యాత్మిక శ్లోకాలు వల్లించడంలో తర్ఫీదు ఇస్తున్నారు. ఆయుధ కర్మాగారంలోని ఆహ్లాదకరమైన వాతావరణంలో తన భార్యతో కలిసి స్వయంగా ఆయనే చిన్నారులకు శ్లోకాలను నేర్పిస్తారు. 20 ఏళ్లగా తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శాస్త్రీయ సంగీతంపై ప్రేరణ కలిగిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో పాఠశాలల్లో మోటివేషనల్ క్లాసులు తీసుకుని విద్యార్థుల్లో మార్పు తీసుకొంచేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులకు భరతనాట్యం, గేయాలు, రచనలు, తెలుగు భాషపై పట్టు సాధించడానికి దోహదపడుతున్నారు. సత్యసాయి తెలుగు-వెలుగు పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీని ద్వారా విద్యార్థులకు చదువు ఒక్కటే సరిపోదని, అన్నిటికంటే ముఖ్యంగా క్రమశిక్షణ, సంస్కృతీసంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంచాలని ఆయన తల్లిదండ్రుల్లోకి ఆయన భావాలను తీసుకెళతున్నారు. సత్యసాయి సేవలకు గాను డాక్టర్ సినారె నుంచి పురస్కారాన్ని అందుకున్నారు.

పత్తి రైతులకు గిట్టుబాటు ధర లేదు

- కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరాజ్‌సింగ్‌కు జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ వినతి

నారాయణఖేడ్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : పత్తికి ప్రస్తుతం మద్దతు ధర రూ.7,521 చెల్లిస్తున్నప్పటికీ రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరాజ్‌సింగ్‌కు విన్నవించారు. రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన గురువారం కేంద్ర మంత్రి విన్నవించారు. వాతావరణంలో నెలకొన్న మార్పులతో అధిక తేమను సాకుగా చూపి కొనుగోలుదారులు రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే రూ.200ల వరకు తక్కువగా చెల్లిస్తున్నారని వివరించారు. పత్తిపంటలో దిగుబడి కూడా తగ్గిందని, ఎకరాకు 8 క్వింటాళ్ల మాత్రమే వస్తుందని తెలిపారు. ఎకరాకు రూ.80 వేల వరకు పెట్టుబడి పెట్టారని, అటు దిగుబడి లేక, ఇటు మద్దతు ధర లభించక పత్తి రైతులు నష్ట పోతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక సమస్యలతో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించి, పూర్తి మద్దతు ధర దక్కేలా చర్యలు చేపట్టాలని మంత్రిని ఎంపీ కోరారు.


కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్

నవోదయ విద్యాలయాన్ని ఖేడ్‌లోనే ఏర్పాటు చేయాలి

కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయనున్న నవోదయ విద్యాలయాన్ని నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ కేంద్ర విద్యా శాఖ మంత్రి జయంత్‌చౌదరిని గురువారం కలిసి వినతిపత్రం అందించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల సంగారెడ్డి జిల్లాకు నవోదయ పాఠశాలను మంజూరు చేసిందని, తమ జహీరాబాద్ పార్లమెంట్ పరిధి సంగారెడ్డి జిల్లాలోనూ ఉన్నందున.. సెగ్మెంట్‌లోని నారాయణఖేడ్‌లో విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో నారాయణఖేడ్ నియోజకవర్గం ఉన్నందున ఈ ప్రాంతంలో పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని తెలిపారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి


గుగ్గిళ్లలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

బెజ్జంకి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల సమీపంలో పరిశ్రమలు నిర్మించడం సరైంది కాదని, ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతుల రద్దు చేయాలని, దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని గుగ్గిళ్ల గ్రామ శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని సీపీఐ నాయకులతో కలిసి ఆయన పరిశీలించి రైతులు, గ్రామస్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పర్యావరణానికి హాని కలిగించే పరిశ్రమలు రద్దు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. గ్రామస్థులు నిర్వహిస్తున్న ఉద్యమాలకు సీపీఐ పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. ఉద్యమం ఉధృతం కాకముందే పరిశ్రమను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతకుముందు మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, మండల కార్యదర్శి రూపేష్ తదితరులు ఉన్నారు.

గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయండి

హుస్నాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాసినట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శంకుస్థాపన చేసి 32 ఏళ్లు గడిచినా పూర్తి కాకపోవడం విచారకరమన్నారు. మరో రూ.247 కోట్లు మంజూరు చేసినట్లయితూ వరద కాలువకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

నిర్వాసితులకు అండగా నిలుస్తాం


గజ్వేల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు అండగా నిలుస్తామని సీపీఎం జాతీయ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన సిద్దిపేట జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి భూనిర్వాసితుల సమస్యలపై చర్చించారు. ఆయనవెంట సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ, నిర్వాసితులు పోచయ్య, రమేశ్, కనకయ్య, బాలయ్య తదితరులున్నారు.


దైవదర్శనానికి వెళ్లి.. తిరిగిరాని లోకాలకు

- మధురైలో జగదేవ్‌పూర్‌వాసి గుండెపోటుతో మృతి

జగదేవ్‌పూర్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా.. గుండెపోటుతో జిల్లాకు చెందిన ఒకరు మృతిచెందిన సంఘటన గురువారం జరిగింది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. జగదేవ్‌పూర్‌కు చెందిన పసగట్ల నగేష్(48) తన మిత్రులతో కలిసి 15న శబరిమలై బయలుదేరి వెళ్లాడు. అక్కడ దర్శనం చేసుకున్న అనంతరం బుధవారం తమిళనాడులోని మధురై చేరుకుని మీనాక్షి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. రాత్రి అక్కడే ఉండి ఉదయం రామేశ్వరం వెళ్లాలనుకోగా, గురువారం తెల్లవారుజామున బాత్‌రూమ్ వెళ్లి వచ్చిన నగేష్ ఒక్కసారిగా బెడ్‌పై పడిపోవడంతో గమనించిన స్నేహితులు వెంటనే అతనిని ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని హైదరాబాద్ తీసుకువస్తున్నారు.

బండరాళ్లు.. అపురూపాలు





హత్నూర మండలం గుండ్లమాచునూర్ గ్రామ శివారులో ప్రకృతి రూపుదిద్దిన ఆకృతితో ఉన్న బండరాళ్లు చూడచక్కగా కనిపిస్తూ ఆకట్టుకుంటున్నాయి. వాటి ఆకారానికి అనుగుణంగా గ్రామస్థులు ఒక్కో గుండును ఒక్కో పేరుతో పిలుస్తారు. పొడవైన మూతి రూపం కలిగి తన కాళ్లపై గద్ద రూపంలో కూర్చుని ఉన్నట్టు కనిపిస్తున్న గుండును గద్ద గుండు అని, గొడుగులాగా ఎండ వాన నుంచి గతంలో వడ్రంగి వృత్తులు చేసే వారికి రక్షణగా ఉన్న గుండును ఒడ్లోని గుండు అని పిలుస్తుంటారు.

– హత్నూర, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి)

విద్యాశాఖలో స్తంభించిన సేవలు!

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెతో తీవ్ర ప్రభావం

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖలో అనుబంధంగా పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెబాట పట్టడంతో విద్యావ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌ల వద్ద 4 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఓవైపు మండల వనరుల కేంద్రాల(ఎంఆర్‌సీ-ఎంఈవో)తో పాటు, కేజీబీవీ, యూఆర్‌ఎస్‌లో విద్యాబోధన నిలిచిపోయింది. మండలస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అందించే నివేదికలు నిలిచిపోయాయి. సమాచారం అందకపోవడంతో విద్యాశాఖ అధికారులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు

సంగారెడ్డి జిల్లాలో 686 మంది

సమగ్ర శిక్షా అభియాన్ కింద జిల్లాలో 686 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వారిలో డీపీవో స్టాఫ్-10 మంది, కేజీబీవీల్లో-324 మంది,(అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్) యూఆర్‌ఎస్ -13 మంది, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు-19 మంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు-23 మంది, ఐఈఆర్‌పీలు-34 మంది, సీఆర్పీలు-111, మెసెంజర్లు-17, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు(పీటీఐలు)-103, సీజీవీఎస్(కేర్ గివర్ వలంటీర్స్)-24 మంది పనిచేస్తున్నారు.

బోధనపై ప్రభావం

సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ పరిధిలో 85 క్లస్టర్లు ఉండగా, అందులో 111 మంది సీఆర్‌పీలు పనిచేస్తున్నారు. వీరిని కాంప్లెక్స్ స్కూళ్లకు కేటాయించారు. ఒక్కో సీఆర్‌పీ వారి క్లస్టర్ పరిధిలోని ఒకటి లేదా రెండు పాఠశాలలను సందర్శించి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతో పాటు మధ్యాహ్న భోజన వివరాల సమచారాన్ని పరిశీలిస్తుంటారు. పాఠశాలల నుంచి విద్యార్థుల వివరాలు సేకరించి యూడైస్‌లో నమోదు చేస్తారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెలవుల్లో వెళ్తే ఆ క్లస్టర్ పరిధిలోని సీఆర్‌పీ ఆ పాఠశాలకు వెళ్లి నడిపిస్తారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడం, పాఠశాల ఖర్చుల వివరాలు సేకరించి విద్యాశాఖాధికారులకు అందజేస్తారు. సమ్మెతో అవేమీ జరగడం లేదు. 12 నుంచి జరగాల్సిన బడి బయటి పిల్లల సర్వే ప్రారంభం కాలేదు. భవిత కేంద్రాల్లో పనిచేసే ఐఈఆర్‌పీలు సమ్మెలో ఉండడంతో దివ్యాంగ విద్యార్థులకు బోధన నిలిచిపోయింది. ఎంఈవో, సమగ్ర శిక్షా కార్యాలయాల్లో సేవలు పూర్తిగా నిలిచివడంతో బడ్జెట్, మెడికల్ రియాంబర్స్‌మెంట్ బిల్లుల ఫైళ్లు కదలడం లేదు. కేజీబీవీల్లోనూ బోధన అట్టకెక్కింది. ఓవైపు పదో తరగతి సిలబస్ ఈనెల చివరి నాటికి పూర్తి చేయాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో నిలిచిన బోధనతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ ప్రభావం వార్షిక పరీక్షల ఫలితాలపై పడే అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.


సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద బతుకమ్మతో సీఆర్‌పీలు

13వ రోజుకు చేరిన సమ్మె

సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె 13వ రోజుకు చేరింది. గురువారం బతుకమ్మ ఆడుతూ వారు నిరసన తెలిపారు. సమ్మెకు టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ లక్ష్మయ్యయాదవ్ సంఘీభావం తెలిపారు.



సమగ్ర శిక్షా ఉద్యోగుల ఆధ్వర్యంలో సిద్దిపేటలో భారీ ర్యాలీ

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులు గురువారం సిద్దిపేట పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, ప్రధాన కార్యదర్శి నవీన్ మాట్లాడుతూ హనుమకొండలో తమకు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి సంవత్సరం గడుస్తున్నా నెరవేర్చడంలో ఎందుకు విఫలమయ్యారని ప్రశ్నించారు. చాయ్ తాగినంతలో సమస్యను పరిష్కరిస్తామని సంవత్సర కాలంగా పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రైతు ‘బేజార్’

వసతులున్నా.. వినియోగం సున్నా



భారీగా దర్శనమిస్తున్న రైతుబజార్ షెడ్లు

- నిరుపయోగంగా జోగిపేట రైతుబజార్
- దూరభారంతో రాని కొనుగోలుదారులు.. ఆసక్తి చూపని విక్రేతలు
- ముందుచూపు లేక రూ.కోట్లు వృథా
- రాత్రిళ్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా

జోగిపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జోగిపేట పట్టణంలో కూరగాయల మార్కెట్‌కు ప్రభుత్వ పరంగా అధికారిక స్థలమేలేదు. నాలుగు దశాబ్దాల క్రితం బస్టాండ్ పక్కన నిర్మించిన కూరగాయల మార్కెట్ ప్రస్తుత అవసరాలకు సరిపోవడం లేదు. అందులోనూ అక్కడ ప్రత్యేకంగా నాన్‌వెజ్ మార్కెట్‌ను నిర్మించారు. కూరగాయల కోసం ప్రత్యేక మార్కెట్ లేకపోవడంతో ఇప్పటికీ మటన్ మార్కెట్ ప్రాంతంలోనే అష్టకష్టాలు పడుతూ కూరగాయల విక్రయిస్తున్నారు. ఇది గమనించిన ప్రభుత్వం 2019లో రూ.1.27 కోట్లతో పట్టణంలోని తాత్కాలిక మున్సిపల్ కార్యాలయం ఎదుట రైతు బజార్ నిర్మాణానికి శ్రీకారం చుట్టి, పనులను 2021లో పూర్తిచేసింది. మరిన్ని నిధులతో ఇక్కడ టాయిలెట్లు, తాగు నీటి వసతి, అంతగర్గత రోడ్లు తదితర మౌలిక వసతుల కల్పనకు పూనుకున్నారు. ఈ పనులు కేవలం పిల్లర్లకే పరిమితమయ్యాయి. అంతేకాకుండా ఈ ప్రాంతం.. మెయిన్ రోడ్డులో కాకుండా బస్టాండ్, దుకాణాలకు దూరంగా ఉండడంతో ప్రజలు కూరగాయలు కొనడానికి ఇక్కడకు రావడం లేదనే సాకుతో కూరగాయల విక్రేతలు జనావాసాల మధ్యనే అమ్మకాలు సాగిస్తున్నారు. దీంతో రోడ్లు విపరీతమైన రద్దీతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా కూరగాయల వ్యర్థాలతో దుర్గంధం వ్యాపిస్తోంది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

రూ. కోట్లు పెట్టి నిర్మించినా కూరగాయల అమ్మకందారులు రాకపోవడంతో రైతుబాజర్ వృథాగా మారింది. ఖాళీగా ఉండడంతో ఎదురుగా ఉన్న మున్సిపల్ కార్యాలయానికి చెందిన పారిశుధ్య వాహనాలు, ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లను ఇక్కడ పార్క్ చేస్తున్నారు. దీంతో రైతుబజార్ కాస్తా పార్కింగ్ ప్లేస్‌గా మారింది. దీనికితోడు రాత్రి వేళల్లో మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

కోట్ల ప్రజాధనం వృథా..

ముందుచూపు లేని అధికారులు, మార్కెట్‌ను ఇక్కడి తరలింపుపై శ్రద్ధ పెట్టని ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో కోట్ల రూపాయాల ప్రజాధనం వృథాగా మారింది. రూ. 1.27 కోట్లతో 15 దుకాణాలు, 64 మంది విక్రేతలు కూర్చునేలా నిర్మించిన షెడ్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. అంతేగాకుండా విక్రేతలు, కొనుగోలుదారుల కోసం నిర్మించిన టాయిలెట్లు, తాగునీటివసతి, బోరు, త్వరలో నిర్మించనున్న అంతర్గత రోడ్లు కోసం వెచ్చించిన నిధులూ వృథా కానున్నాయి.



మున్సిపల్ వాహనాల పార్కింగ్

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



వెల్దుర్తి పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి మాట్లాడుతున్న ఎస్పీ

వెల్దుర్తి/శివ్వంపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహద పడుతాయని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం వెల్దుర్తి, శివ్వంపేట పోలీస్ స్టేషన్లను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించి, కేసులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. గంజాయి, మత్తు పదార్థాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఆయన వెంట తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ రంగకృష్ణ, వెల్దుర్తి ఎస్‌ఐలు రాజు, మధుకర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

‘ఆయిల్ పామ్’తో రెట్టింపు ఆదాయం

- జిల్లా ఉద్యానశాఖ అధికారి ప్రతాప్‌సింగ్



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రతాప్‌సింగ్

తూప్రాన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో రెట్టింపు ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి ప్రతాప్‌సింగ్ అనారు. గురువారం తూప్రాన్ రైతు వేదికలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఎకరా వరిసాగు చేసే నీటితో ఐదు ఎకరాల ఆయిల్ పామ్ పండించవచ్చని తెలిపారు.2023-24 సంవత్సరంలో 78 మంది రైతులు 336 ఎకరాల్లో సాగు చేపట్టారన్నారు. ఇప్పటివరకు 1623 ఎకరాలకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. లివ్ ఫామ్ రిసోర్సెస్ ప్రైవేటు లిమిటెడ్ ప్రతినిధి కృష్ణ, ఏవో గంగుమల్లు, ఉద్యానశాఖ అధికారి రచన, ఏఈవోలు సంతోష్, సింధు, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు,

పశుపోషణలో జాగ్రత్తలు తప్పనిసరి

- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటయ్య

టేక్మాల్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి) : రైతులు పాడి పశువుల పోషణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మెదక్ జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ఎస్. వెంకటయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని కలులూర్ గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన సాంకేతికతతో లింగ నిర్ధారత వీర్య నాలిక వినియోగించి మేలుజాతి ఆడదూడలు పుట్టించవచ్చునన్నారు. దీంతో ఆవుల గేదెల సంఖ్య గణనీయంగా పెరిగి రైతులకు లాభసాటి మారుతుందన్నారు. కార్యక్రమంలో టేక్మాల్ మండల పశువైద్య అధికారి డాక్టర్ నాగరాజు, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ హనుమంతు, సూపర్ వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

- డీఎల్పీవో సరేష్ బాబు



స్కూల్ పరిసరాలను పరిశీలిస్తున్న సరేష్ బాబు

చిన్నశంకరంపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు విద్యను అందించాలని మెదక్ డీఎల్పీవో సురేష్ బాబు అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండల పరిధిలోని మిర్జాపల్లి గ్రామాన్ని సందర్శించి పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి అనంతరం ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్ సర్వేను పరిశీలించారు. అలాగే హైస్కూల్లో సందర్శించి మధ్యాహ్న భోజనం వంటల నాణ్యత తీరును ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నర్సింహులు ఉన్నారు.

సంగం(కే)లో అభిప్రాయ సేకరణ

ఝరాసంగం,డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని సంగం(కే)ను గ్రామ పంచాయతీగా మార్చాలని కోరుతు గతంలో గ్రామస్థులు అధికారులక విన్నవించారు. దీంతో డీఎల్‌పీవో అమృత నేతృత్వంలో గురువారం గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించి ప్రజాభ్రిప్రాయ సేకరణ చేపట్టారు.

తలాపునే చెరువున్నా.. పొలం బీడే!

(ఐదోపేజీ తరువాయి)

ఎత్తిపోతల పథకం పూర్తికాకుండా అటకెక్కింది. మోటార్లను దొంగలు ఎత్తుకెళ్లారు.

ప్రతిపాదనలు బుట్టదాఖలు

ఈ చెరువు అభివృద్ధికి గతంలో అధికారులు పలుమార్లు ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపినా నిధులు మాత్రం మంజూరు కాలేదు. ఆరేళ్ల చెరువు అభివృద్ధి, కుడి, ఎడమ కాల్వల మరమ్మతు కోసం రూ. 4.89 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపించినా ఉన్నతాధికారులు తిరస్కరించారు. పట్టించుకునేవారు లేక నిండా నీళ్లున్నా.. చెరువు నిరుపయోగంగా మారింది.

చెరువును బాగు చేయాలి..

పెద్దచెరువు కట్ట, కాలువలను బాగుచేసి రైతులకు ఉపయోగపడేలా చెరువును అభివృద్ధి చేయాలి. చెరువును పునరుద్ధరిస్తే ఆయకట్టు రైతుల సాగునీటి కష్టాలు తీరుతాయి.

- తుక్కప్ప, గొటిగర్‌పల్లి

గతంలోనే ప్రతిపాదనలు పంపించాం

గొటిగర్‌పల్లి పరిధిలోని పెద్దచెరువు అభివృద్ధికి నిధుల కోసం గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. రూ. 4.5 కోట్ల మేరా అంచనాతో ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే చెరువు అభివృద్ధి పనులు చేపడుతాం.

-రవీందర్, ఇరిగేషన్ ఏఈ, కోహీర్

పదిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం..



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ విద్యాశాఖ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గతేడాది కంటే ఉత్తమ ఫలితాలు సాధించాలని.. అందుకోసం ప్రతత్యేక యాక్షన్ ప్లాన్ తయారు చేసి అమలు చేయాలన్నారు. ఈ నెల చివరి వరకు పదవ తరగతి సిలబస్ పూర్తి చేయాలని .. చదువులో వెనకడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేందుకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ, మెదక్ ఎంఈవో నీలకంఠం, అకాడమిక్ మానిటరింగ్ అధికార సంబంధిత ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీమద్భాగవతంతో ఆధ్యాత్మిక జ్ఞానం

- మాధవానంద సరస్వతీ స్వామి

మెదక్ అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భగవంతుడు మన మనస్సులోకి ప్రవేశించేందుకు అవసరమైన ఆధ్యాత్మిక మార్గాలను తెరిచి, మనశ్శాంతిని, ఆనందాన్ని అందించి, చివరకు ముక్తివైపు నడిపంచే శక్తి శ్రీమద్భాగవతానికి ఉందని రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న శ్రీమద్భాగవత జ్ఞానయజ్ఞం కార్యక్రమంలో గురువారం స్వామి మాట్లాడుతూ.. ప్రపంచం అంత ధర్మంపై ఆధారపడి ఉందన్నారు. వారం రోజుల పాటలు ప్రవచకులు ప్రవచనాలు విని తరించాలని స్వామి పిలుపునిచ్చారు. ఫణిరాజ్‌శర్మ, రామేశ్వరశర్మ ప్రబోధికులచే భాగవత మహత్యం గురించి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సాయిబాబా, పండిత్‌రావు, మధుసూదనచార్యులు, కృష్ణమూర్తి, నరేందర్, వేద వాస్యచార్యులు, రవీందర్‌బాబు, జనార్ధన్, వైద్యశ్రీనివాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మెనూ పక్కాగా అమలు చేయాలి

- నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు
- సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు



చౌటకూర్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

జోగిపేట, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): నూతన మెనూను పక్కాగా అమలు చేయాలని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదేశించారు. గురువారం జోగిపేటలోని మైనార్టీ బాలికల గురుకులాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు రుచి, శుచితో కూడిన ఆహారం అందించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం, మధ్యాహ్న భోజన సమయంలో కలెక్టర్ విద్యార్థినులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. అలాగే అందోలు శివార్లలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌మాల్‌లో అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్‌వాడీ మేళాను కలెక్టర్ క్రాంతి వల్లూరి సందర్శించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీవో పాండు, మండల ప్రత్యేకాధికారి గీత, ఎంపీడీవో రాజేశ్, ఎంఈవో క్రిష్ణ, మైనార్టీ గురుకుల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సర్వే వేగం పెంచండి

పుల్‌కల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వేను గడువులో పూర్తి చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రం చౌటకూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల సర్వే ప్రక్రియను గురువారం ఆమె పరిశీలించారు. ఈ నెల 31వ తేదీలోగా వివరాలను ఇందిరమ్మ ఇళ్ల ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. గ్రామంలో 890 మంది పక్కా ఇళ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నారని, ఇప్పటి వరకు 100కు పైగా లబ్దిదారుల పేర్లను యాప్‌లో నమోదు చేశామని పంచాయతీ కార్యదర్శి సందీప్‌గౌడ్ కలెక్టర్‌కు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న కాశన్నగారి గంగయ్య ఇంటిని కలెక్టర్ స్వయంగా వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, మండల ప్రత్యేకాధికారి బాలరాజు, ఇన్‌చార్జి తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్, ఎంపీడీవో ఆనందమేరీ, ఆర్‌ఐ రాజు, పంచాయతీ కార్యదర్శి సందీప్‌గౌడ్, ఈజీఎస్ క్షేత్ర స్థాయి సహాయకురాలు అనురాధ, కాంగ్రెస్ నాయకులు కలాలి రామాగౌడ్, వర్కల రమేశ్, కైసర్, గొని కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన



సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద రాస్తారోకో చేస్తున్న దళిత బహుజన సంఘాల నాయకులు

న్యూస్ నెట్‌వర్క్, (ఆంధ్రజ్యోతి) : కేంద్రమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై పలు సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని నినాదాలు చేశారు. సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో, నారాయణఖేడ్ కేవీపీఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్రమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మలను దహనం చేశారు.

ఏడాదిన్నరగా వెలగని వీధి దీపాలు

అల్లాదుర్గం,డిసెంబరు19.(ఆంధ్రజ్యోతి) : ఏడాదిన్నర కాలంగా అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లోని 6వ వార్డులో వీధి దీపాలు వెలగడం లేదని గ్రామస్థులు మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ట్రాన్స్‌కో అధికారులను నిలదీశారు. ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతధికారులను ఆదేశించినా పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించకుంటే సబ్‌స్టేషన్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

మాల మాహానాడు నాయకుల అరెస్టు

న్యూస్ నెట్‌వర్క్, (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాల మహానాడు నాయకులను జిల్లావ్యాప్తంగా పోలీసులు బుధవారం రాత్రి, గురువారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎన్ని అరెస్టులు చేసిన వెనకడగు వేయకుండా న్యాయం జరిగేవరకు పోరాడుతామన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి

కల్హేర్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : చలి తీవ్రతకు నారుమడి ఎదగక పోవడంతో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాము సూచించిన సస్య రక్షణ చర్యలు పాటిస్తే చాలని నారాయణఖేడ్ వ్యవసాయ సహాయ సంచాలకుడు నూతన్‌కుమార్ అన్నారు. నిజాంపేట మండల పరిధిలోని జంబికుంటలో గురువారం ఏడీఏ వరినారు మడిని పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుచూ నారు మడికి సాయంత్రం పూట నీరు తొలిగించి తిరిగి ఉదయం వెచ్చని బోరు నీరు పట్టాలని సూచించారు. నారు మడి చుట్టూ రోజు సాయంత్రం పూట ఒక ఫీటు ఎత్తులో వెదురు కట్టెలు పాతి వాటిపై కవర్లు కప్పి మరుసటి రోజు తీసివేస్తే చలి తీవ్రత నుంచి నారు మడిని కాపాడవచ్చునని సూచించారు. ఏఈవో వంశీ, రైతులు నర్సింహారెడ్డి, లింగారెడ్డి, రవిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థిపై దృష్టి సారించాలి

నారాయణఖేడ్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మెరుగైన ఫలితాల కోసం ప్రతి విద్యార్థిపై దృష్టి సారించాలని జ్యోతిబా పాఠశాలల కోఆర్డినేటర్ గౌతమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం నారాయణఖేడ్ శివార్లలోని జ్యోతిబా గురుకుల పాఠశాలతోపాటు బాచేపల్లి గురుకుల పాఠశాలలను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వసతులు విద్యాబోధన తదితర విషయాలను పరిశీలించారు. అనంతరం నారాయణఖేడ్ పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

నాగల్‌గిద్ద, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని నాగల్‌గిద్ద మండల ఎంఈవో మన్మథకిషోర్ అన్నారు. గురువారం మోర్గి మోడల్ కళాశాలలో సుమారు 560 మంది విద్యార్థులకు ఎన్ఆర్‌ఐ జగదీష్, శ్యాంసుందర్, వేణుగోపాల్‌ల ఆధ్వర్యంలో విద్యా సామగ్రితో పాటు కళాశాలలోని లైబ్రరీకి పోటీ పరీక్షల మెటీరియల్ బహూకరించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్యామలాదేవి ఫౌండేషన్ బృందానికి ఎంఈవో అభినందలు తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బస్సు : ఇద్దరికి తీవ్ర గాయాలు

మనోహరాబాద్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం రావెల్లి గ్రామానికి చెందిన బోళ్ల బోయిన మల్లేష్ మంగళవారం తన ట్రాక్టర్‌తో మనోహరాబాద్ మండలంలో జాతీయ రహదారి వద్ద యూటర్న్ తీసుకుంటుండగా మేడ్చల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలుకాగా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.

అట్టహాసంగా సీఎం కప్ క్రీడలు



సంగారెడ్డిలో కిక్ బాక్సింగ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియంలో సీఎం కప్ క్రీడలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా నాలుగవ రోజు బ్యాడ్మింటన్, కిక్‌బాక్సింగ్ క్రీడలను డీవైఎస్‌వో ఖాసింబేగ్ ప్రారంభించారు. ఇక రెజ్లింగ్ పోటీలను జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి అనిల్‌కుమార్ ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు ఆయా క్రీడాంశాల్లో పోటాపోటీగా తలపడుతున్నారు. ఇలా ఉండగా బ్యాడ్మింటన్ క్రీడలో ప్రతిభ కనబర్చిన వారికి మెడల్స్ అందజేశారు. డీవైఎస్‌వో ఆఫీస్ సూపరింటెండెంట్ జావిద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో చేగుంట విద్యార్థుల సత్తా

చేగుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడల్లో చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. బాలికల విభాగంలో 200 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో గాయత్రి, 800 మీటర్ల పరుగు పందెంలో అంకిత రెండో స్థానంలో నిలిచారని ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు శారద గురువారం తెలిపారు. జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడల్లో ప్రతిభ కనబరిచి విద్యార్థులను పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు రఘుపతి , ఉపాధ్యాయులు అభినందించారు.

చలికి వణుకుతున్నా.. చీపురు పట్టాల్సిందే!

(ఐదోపేజీ తరువాయి)

ఉండనే ఉంటుంది. కానీ పారిశుధ్య కార్మికుల వరకు వచ్చేసరికి దౌర్భాగ్యమైన పరిస్థితులు దాపురించాయి. కోట్లాది రూపాయల ఆదాయం ఉన్నా వీరికి కనీస సౌకర్యాలను కల్పించడంలో వెనుకంజ వేస్తున్నారు. స్వెటర్లు, బూట్లు, మంకీ క్యాప్‌లు, గ్లౌజులు సైతం సరఫరా చేయడంలో తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు.

వణుకుతూనే..

గత పది రోజులుగా సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అత్యల్పస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా 6.5 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. సాయంత్రం 5 గంటలు దాటితేనే ఇళ్లకు చేరుతున్న పరిస్థితి. మళ్లీ ఉదయం 9 గంటల తర్వాతనే కాలు బయటపెడుతున్నారు. పట్టపగలు కూడా చాలా మంది స్వెటర్లు, మంకీ క్యాప్‌లు ధరించి కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెల్లవారుజామున 4 గంటలకే వీధులన్నీ శుభ్రం చేయడానికి బయల్దేరుతున్న కార్మికుల పరిస్థితి నిజంగా ఆందోళనకరమే. చాలీచాలని వేతనాలతో స్వెటర్లు, గ్లౌజులు కొనుగోలు చేయలేక పాత చొక్కాలను స్వెటర్లలా ధరిస్తున్నారు. చలికి వణుకుతూ పట్టణాలను పరిశుభ్రంగా మార్చుతున్నారు.

దాతలు ముందుకొచ్చేనా!

చలికాలంలో విద్యార్థులకు, అనాథలకు స్వెటర్లు, దుప్పట్లు పంపిణీ చేసే స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఈ పారిశుధ్య కార్మికులను సైతం ఆదుకోవాల్సి అవసరం ఎంతైనా ఉంది. ఆయా మున్సిపాలిటీల్లో గ్లౌజులు, బూట్లు, సేఫ్టీ అప్రాన్లు అందజేశారు. కానీ మెజారిటీ మున్సిపాలిటీల్లో మాత్రం ఇవ్వలేదు. అందుకే పారిశుధ్య కార్మికుల కష్టాలు చూసైనా దాతలు స్పందించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందరి ఆరోగ్యం కోసం శ్రమించే తమ ఆరోగ్యం కొరకు దాతలు ముందుకురావాలని కార్మికులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

హాస్టళ్ల సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి గురువారం శాసన సభలో గళమెత్తారు. గత పాలకులు హాస్టళ్ల నిర్వహణను నిర్వీర్యం చేశారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం అనేక హాస్టళ్లు, గురుకులాలు, పాఠశాలలను సందర్శించానన్నారు. ఒక హాస్టల్‌లో 400 మంది విద్యార్థులు ఉంటే 125 ఫ్యాన్లకు, 12 ఫ్యాన్లు మాత్రమే పని చేస్తున్నాయన్నారు. గురుకులాలు, కళాశాలల్లో రెగ్యులర్ అధ్యాపకులు లేరని, కేవలం ఒకరు, ఇద్దరు మాత్రమే రెగ్యులర్ వారు కొనసాగుతున్నారన్నారు. తమ నియోజకవర్గం వెనుకబడి ఉన్నందున అన్ని పాఠశాలలు, కళాశాలల్లో రెగ్యులర్‌పోస్టులు మంజూరు చేయాలన్నారు. తాను విమర్శలకు ప్రతి విమర్శలు చేయడం లేదని, వాస్తవికతను సభా దృష్టికి తీసుకువస్తున్నానన్నారు.

చిట్కుల్‌లో కార్డన్ సెర్చ్

పటాన్‌చెరు, డిసెంబరు, 19: పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలోని చిట్కుల్ వడ్డెర కాలనీలో గురువారం ఉదయం డీఎస్పీ రవీందర్‌రెడ్డి నేతృత్వంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఉదయం ఐదు నుంచి ఏడు గంటల వరకు కాలనీలోని ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. సరైన పత్రాలు లేని 60బైకులు, 3కార్లు, 10 ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ కాలనీ వాసులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

నేడు కారు వేలం

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 19 : సంగారెడ్డి పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో మారుతి స్విఫ్ట్ కారును శుక్రవారం నాడు వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ శాఖ సిఐ ఎం.డి.నజీర్ పాష ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌డిపిఎస్ కేసులో పట్టుబడిన ఈ కారును వేలం వేస్తున్నామని చెప్పారు. ఆసక్తి గల వారు ఈ వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

రిటైర్డు వెటర్నరీ డాక్టర్ అదృశ్యం



వెంకటస్వామి (ఫైల్)

తూప్రాన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం రిటైర్డు వెటర్నీ డాక్టర్ అదృశ్యమైనట్లు తూప్రాన్ ఎస్‌ఐ శివానందం తెలిపారు. చిన్న శంకరంపేట మండలం కొర్విపల్లి గ్రామానికి చెందిన శ్రీచుర్ణం వెంకటస్వామి (75), భార్య లక్ష్మీతో కలిసి సిద్దిపేట జిల్లా వర్గల్ మండల నాచారంగుట్ట లక్ష్మీనర్సింహాస్వామిని దర్శించుకోడానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్లేందుకు నాచారం గుట్ట నుంచి ఆర్టీసీ బస్సులో తూప్రాన్‌కు వచ్చి ఆర్టీసీ బస్టాండ్‌లో దిగారు. వెంకటస్వామిని కూర్చోబెట్టి కూరగాయలు తీసుకురావడానికి భార్య లక్ష్మీ మార్కెట్‌కు వెళ్లింది. కొనుగోలు చేసుకొని తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్‌కు లక్ష్మీ విచ్చేయగా, వెంకటస్వామి కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినప్పటికీ ఆచూకి లభించకపోవడంతో కొడుకు సురేష్ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం వివరించారు.

బయటకెళ్లిన యువకుడు..



కరుణాకర్ (ఫైల్)

తూప్రాన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లికి చెందిన యువకుడు అదృశ్యమైనట్లు తూప్రాన్ ఎస్‌ఐ శివానందం తెలిపారు. గ్రామానికి చెందిన నీరుడి కరుణాకర్ (23) ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 17న ఉదయం 10 గంటల ప్రాంతంలో ఫోన్ రావడంతో ఎవరికి చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయాడు. రెండు రోజులుగా ఇంటికి రాకపోగా, వెతికినప్పటికీ ఆచూకి లభించలేదు. గురువారం తండ్రి నీరుడి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

మరో ఘటనలో మహిళ..



నాగరాణి ఫైల్)

చేగుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో గొడవపడి మహిళ అదృశ్యమైన సంఘటన చేగుంట మండలం బోనాల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పులబోయిన నాగరాణి(30)భర్త పది సంవత్సరాల క్రితం చనిపోవడంతో తల్లిగారిల్లు అయిన బోనాల గ్రామంలో నివాసముంటుంది. బుధవారం ఉదయం తన చిన్న మనుమడు స్కూల్ లంచ్ బాక్స్ కట్టే విషయంలో తల్లి కూతురు గొడవ జరిగింది. కాగా, రాత్రి పొలం నుంచి ఇంటికి వచ్చేసరికి కూతురు నాగమణి ఇంట్లో లేకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకి దొరకరపోవడంతో తల్లి శశికళ గురువారం చేగుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.